క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండ



సాయం అందిస్తున్న ఉద్యోగులు

కుంటాల: మండలంలోని కల్లూరులో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ గైని రాందాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తమ వంతుగా రూ.41వేలు పోగు చేసి గురువారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో లింబాద్రి హామీ ఇచ్చారు.

కాన్షీరాం వర్ధంతి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం కాన్షీరాం 18వ వర్ధంతిని ధర్మసమాజ్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ రాజు మహారాజ్, నాయకులు కాసారం రాములు తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పాం'పై అవగాహన

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో గురువారం ఆయిల్‌పాం తోటలను ఏఈవో శ్రీనివాస్ పరిశీలించారు. పంట ఎదుగుదల, ఎరువుల వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సాగుకు ఆసక్తి కల్గిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వారి వెంట ఫీల్డ్ ఆఫీసర్ యోగేశ్, ఆనంద్‌రావ్ తదితరులు ఉన్నారు.

దసరా, బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: దసరా పండుగను పురస్కరించుకొని ఈనెల 12న పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(రాంలీలా) మైదానంలో చేపట్టే రావణవధ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం హిందూ ఉత్సవ సమితి నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 14న ఖానాపూర్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ ఉత్సవసమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, పడాల రాజశేఖర్, శెట్టి శ్యామ్, జితేందర్ తదితరులు ఉన్నారు.

నీటి ట్యాంకులో కోతి కళేబరం

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామంలో బస్టాండ్ ఏరియాలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులో నాలుగైదు రోజుల కిందట కోతి పడి మృతి చెందింది. గ్రామస్తులు ఆ నీటినే తాగారు.. రెండు రోజులుగా ఇంటింటికీ సరఫరా అవుతున్న నల్లా నీరు వాసన రావడంతో గ్రామస్తులు ట్యాంకు వద్దకు వెళ్లి చూడగా అందులో కోతి చనిపోయి ఉంది. ఇప్పటికే జ్వరాలతో బాధపడుతున్నామని.. కోతి చనిపోయిన నీటిని తాగితే మా ఆరోగ్య పరిస్థితి ఏంటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై ఎంపీవో మోహన్‌సింగ్ మాట్లాడుతూ ట్యాంక్‌లోంచి కోతి కళేబరం తీసివేసి బ్లీచింగ్ పౌడర్‌తో ట్యాంకును శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

భైంసారూరల్: కుంటాల, కుభీర్, భైంసా మండలాల్లోని ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. గురువారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దుర్గాదేవి నిమజ్జనం, దసరా వేడుకలు, దమ్మ చక్రపరివర్తన్ దివస్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. యువకులు, గ్రామపెద్దలు ఐక్యంగా ఉండి.. అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో ఐదు జట్లు పాల్గొన్నాయి. ఈగల్, టైటాన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగగా ఈగల్ జట్టు విజయం సాధించింది. ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, రన్నరప్‌గా నిలిచిన టైటాన్స్ జట్టుకు రూ.5వేల నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా సీఐ సైదారావు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహేందర్, గిరి, ఉపేందర్ తదితరులున్నారు.

ఎయిడ్స్ నివారణలో భాగస్వాములవ్వాలి

నిర్మల్‌రూరల్: ఎయిడ్స్ నివారణలో స్వయం సహాయక సంఘాల మహిళలు భాగస్వాములు కావాలని ఐకేపీ ఏపీఎం బోస్ అన్నారు. గురువారం మండలంలోని రత్నాపూర్‌కాండ్లీలో మహిళలకు హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలపై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం ఎయిడ్స్ నివారణ జాగ్రత్తలను వివరించే కరపత్రాలను విడుదల చేశారు. ఐకేపీ సీసీ కిరణ్మయి, వీవోఏ నర్సయ్య, గ్రామైక్య అధ్యక్షురాలు సంతోష, కోశాధికారి సల్మా బేగం, కార్యదర్శి మమత, ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు సుదర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు సుస్తీ..!

- భైంసాలో వైద్యసిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్న రోగులు
- వ్యాధుల కాలంలో పెరుగుతున్న ఓపీ



గురువారం వైద్యుడు లేక ఖాళీగా కుర్చీ



భైంసా పట్టణంలోని బస్తీ దవాఖానా

భైంసాటౌన్: గత ప్రభుత్వం ప్రజలకు వైద్యసేవలు చేరువ చేసేందుకు పట్టణాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా భైంసా పట్టణంలోని ఏపీనగర్‌లోనూ బస్తీ దవాఖానా ప్రారంభించారు. అయితే ఇక్కడ సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భైంసా బస్తీ దవాఖానకు వైద్యాధికారితోపాటు నర్సింగ్ ఆఫీసర్, అటెండర్, సపోర్టింగ్ స్టాఫ్ అవసరం కాగా.. ప్రస్తుతం నర్సింగ్ ఆఫీసర్ మాత్రమే ఉన్నారు. పట్టణంలోని అర్బన్ పీహెచ్‌సీ వైద్యుడు కమలేశ్.. బస్తీ దవాఖానాకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గురువారం 'సాక్షి' భైంసాలోని బస్తీ దవాఖానాకు వెళ్లి పరిశీలించగా ఖాళీ కుర్చీ దర్శనమిచ్చింది. కేవలం నర్సింగ్ ఆఫీసర్ మాత్రమే రోగులకు అందుబాటులో ఉన్నారు. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇద్రిజ్ ఫెరీని ప్రశ్నించేందుకు 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

నిత్యం 50కిపైనే ఓపీ...

పట్టణంలోని బస్తీ దవాఖానాకు ప్రతిరోజు 40 నుంచి 50 మందికిపైగా రోగులు ఓపీ సేవల కోసం వస్తుంటారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో బస్తీ దవాఖానా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ ఆస్పత్రికే వస్తుంటారు. పక్కనే ఉన్న ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాతోపాటు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు సైతం అనారోగ్యం బారిన పడితే ఈ దవాఖానకే వస్తుంటారు. కాగా ఆసుపత్రికి రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో ఇన్‌చార్జి వైద్యుడు సెలవులో ఉన్న సందర్భాల్లో రోగులు ఇబ్బంది పడుతున్నారు. నర్సింగ్ అధికారి ఒక్కరే ఉన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వారూ సెలవు పెడితే ఆసుపత్రి మూసి ఉంచే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి బస్తీ దవాఖానాలో రెగ్యులర్ వైద్యుడితోపాటు సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గమ్మ దర్శనం.. పరవశించిన భక్తజనం



లక్ష్మణచాంద : పీచరలో సమర్పించిన నైవేద్యాలు



సోన్: కూచన్‌పెల్లిలో బోనాలతో వస్తున్న భక్తులు



లక్ష్మణచాంద: ధర్మారంలో బోనాలతో భక్తులు



కుంటాల : గజ్జలమ్మ ఆలయం వద్ద..



ఖానాపూర్: శివాజీనగర్‌లో..

నర్సాపూర్(జి): జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని తిమ్మాపూర్(జి)లో ఫ్రెండ్స్ యూత్ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద గురువారం దంపతులు హోమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పురోహితులు కాంతారావు తదితరులున్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్‌లో ఎల్లమ్మగుట్టపై వెలిసిన స్వయంభు దుర్గమ్మ వద్ద భక్తుల సందడి నెలకొంది. గురువారం ఎల్లమ్మగుట్ట వద్దకు భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. ఎల్లమ్మగుట్ట సమీపంలోని దత్తాత్రేయ, శివాలయంలోనూ పూజలు చేశారు.

కడెం: మండలంలోని లింగాపూర్, బెల్లాల్, మాసాయిపేట్, అంబారిపేట్, తదితర గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద కుంకుమపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎలగడపలో దుర్గమాతను దర్శించుకున్న బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్‌ను గ్రామస్తులు సన్మానించారు.

కుంటాల: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో మహిళలు గురువారం బోనాల పండుగ నిర్వహించారు. ప్రధాన వీధులగుండా భక్తులు నెత్తిన బోనాలతో వెళ్లి గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కుంటాల మండలంలోని ఓలాలో దుర్గామాతను 21 రకాల పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించగా వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

11 ఏళ్లుగా కర్ర ప్రతిమ



అమ్మవారి ప్రతిమ

కుభీర్: మండలంలోని సెర్పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి కర్ర ప్రతిమ ఆకట్టుకుంటుంది. 11ఏళ్లుగా ఏటా శరన్నవరాత్రులు పూజలు చేసి నిమ్మజనం రోజు నీళ్లు చల్లి మందిరంలో మళ్లీ భద్రపరుస్తారు. ఈ ప్రతిమను కుభీర్‌కు చెందిన సాయిశ్యాం అనే కళాకారుడు తయారు చేయగా 2013లో ప్రతిష్ఠించారు. ఈ విగ్రహం పక్కనే మరో మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి..నవరాత్రుల అనంతరం నిమజ్జనం చేస్తారు. రోజు రాత్రి అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఓలా గ్రామంలో దుర్గాదేవి మండపం వద్ద మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్, పద్మావతినగర్, రాజీవ్‌నగర్‌తోపాటు తర్లపాడ్ గ్రామంలోని దుర్గాదేవి మండపాల వద్ద మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రానగర్ కాలనీలో గడ్డి ఓంకార్ దుర్గాదేవి దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. పలు మండపాల వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మ వారికి 90 రకాల నైవేద్యాలు

లక్ష్మణచాంద: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ధర్మారంలో బోనాల జాతర నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

లక్ష్మణచాంద మండలంలోని పీచరలో దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారికి 90 రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం బోనాల జాతర, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కూచన్‌పెల్లి, న్యూవెల్మల్ గ్రామాల్లో దుర్గామాతకు భక్తులు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు, భవానీ దీక్షాపరులు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. న్యూవెల్మల్ శ్రీ గాయత్రీ అమ్మ సేవా సమితి సభ్యులు, కూచన్‌పెల్లిలో దేవి ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

తానూరు: మురికికాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ రోడ్లపై చెత్త పడేయకుండా గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చూడాలన్నారు. వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి 30 వరకు గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో నసీరుద్దీన్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎంఈవో కార్యాలయం ప్రారంభం

బాసర: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంఈవో కార్యాలయాన్ని అధికారులు, ఉపాధ్యాయులు ప్రారంభించారు. ముందుగా ఎంఈవో మైసాజీ సరస్వతి అమ్మవారి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎస్సై గణేశ్, మాజీ సర్పంచ్ డి.లక్ష్మణ్‌రావు.. ఎంఈవోను ఘనంగా సన్మానించారు. నోడల్ అధికారి నర్సారెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం ఎస్.నర్సయ్య, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు మమ్మాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డి.రమేశ్, రవీందర్, కంటిగారి నరేందర్ రావు, గంగారావ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా గంగాధర్

ముధోల్: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కొక్కుల గంగాధర్‌ను హైదరాబాద్‌లో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి తోట నరేంద్రబాబు, రమణారావుకు గంగాధర్ ధన్యవాదాలు తెలిపారు.

పట్టణ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్

ఖానాపూర్: తెలంగాణ జనసమితి యువజన విభాగం పట్టణ అధ్యక్షుడిగా వొడ్నాల విష్ణువర్ధన్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కోదండరాం పర్యటనలో భాగంగా ఇటీవల సభ్యత్వం తీసుకున్న విష్ణువర్ధన్‌ను యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం

ఖానాపూర్: ఇటీవల ఎంబీబీఎస్, ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన విద్యార్థులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురిని ఖానాపూర్ మున్నూరుకాపు యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సంఘ భవనంలో సంఘం యూత్ అధ్యక్షుడు గాద్పు రాజభూషణ్, సంఘం అధ్యక్షుడు పసుపుల నరేందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, కోశాధికారి మణికంఠ, సంఘం గౌరవ అధ్యక్షులు పాదం రాకేశ్ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజేందర్, ఇస్తారి, రాజేశ్వర్, నాగరాజు, రాకేశ్, రవి, వంశీ, రవికాంత్, సాయితేజ, సాయికిరణ్, తదితరులు ఉన్నారు.

సన్మానం

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామంలో నిరుపేద కుటుంబానికి గట్టు పోసాని-కాశీరాం దంపతుల ప్రథమ కుమార్తె స్వప్న డీఎస్సీ-2024 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(బయాలజీ)గా ఎంపికై జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచింది. గురువారం ఆమెను సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ విఠల్ కాంబ్లే ఆధ్వర్యంలో సన్మానించారు. బాబు లింగం, హన్మాండ్లు, రవి, రాజు, ముత్యం, దేవన్న, ప్రశాంత్, అఖిల్, ముత్తన్న, నారాయణ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పూజలు

తానూరు: మండల కేంద్రంలోని డాంగపల్లి పెద్దమ్మతల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షులు పండరి, ఉపాధ్యక్షుడు రాములు, సభ్యులు గోవింద్‌రావ్ పటేల్, మాధవ్‌రావ్ పటేల్, లక్ష్మణ్, యోగేశ్, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబు తదితరులు ఉన్నారు.

రతన్ టాటాకు నివాళి

నిర్మల్‌టౌన్: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా ఎంతోమందిగా స్ఫూర్తిగా నిలిచారని పాత్రికేయులు పేర్కొన్నారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

'ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలి'

నిర్మల్‌టౌన్: ఏకసభ్య కమిషన్‌ను వెంటనే రద్దు చేసి.. హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్లు రంజిత్, వెంకటస్వామి అన్నారు. గురువారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల తర్వాత కులగణన జరగలేదన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ వారిని తెలుసుకునేందుకు కులగణన చేపట్టాలన్నారు. బీజేపీకి మద్దతు తెలిపిన మందకృష్ణ మాదిగకు సీఎం అనుకూలంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఎ.రాజేశ్వర్, జి.రాజేశ్వర్, కొంతం అడెల్లు, గంగన్న, బోస్, డొంగారి లక్ష్మణ్, పోశెట్టి, వినయ్, విష్ణు తదితరులున్నారు.

'పర్యవేక్షణ లేకనే మొరం దందా'

ఖానాపూర్: అధికారుల పర్యవేక్షణ లేకనే పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మొరం దందా సాగుతోందని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. హైవే రోడ్డు పనులతో పాటు ఇతర ప్రైవేట్ పనుల పేరిట పగలు, రాత్రి తేడా లేకుండా మొరం దందా జరుగుతోందన్నారు. అధికారులు మామూళ్లకు అలవాటుపడి ఈ దందాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

నీటి సహాయకులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్ అందిస్తున్న డీపీవో శ్రీనివాస్

లోకేశ్వరం: గ్రామాల్లో భగీరథ నీటి సహాయకులుగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు లోకేశ్వరంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిసినట్లు డీఎల్‌పీవో సుదర్శన్ పేర్కొన్నారు. నాలుగు రోజుల శిక్షణలో పైపులైన్లను బిగించు విధానం, నీటి సామర్థ్యాన్ని పరిశీలించుట, చేతిపంపులకు మరమ్మతులకు సింగిల్‌ఫేజ్ మోటార్ల వినియోగం, మరమ్మతులు చేసే విధానంపై సహాయకులకు అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రిడ్ ఈఈ రాఘవేంద్రరాజు, భగీరథ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ ప్రశాంత్, గ్రిడ్ ఏఈ సుమన్, ఎంపీడీవో వెంకటరమేశ్, సోలమాన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో నీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణలో 60 మంది మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈఈ అరుణ్‌కుమార్, తానూర్ ఏఈ పృథ్వీ, ఎంపీడీవోలు అశోక్, శివకుమార్, ఎంపీవో గంగాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: గ్రామాల్లో భగీరథ నీటి సహాయకులుగా పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు గురువారం సారంగాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ శిక్షణ పొందిన పలువురు సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఆయా గ్రామాల నీటి సహాయకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంబురంగా సద్దుల బతుకమ్మ



లోకేశ్వరం : పంచగుడిలో బతుకమ్మల వద్ద..



విఠాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



లోకేశ్వరం : గడ్‌చాందలో..

లోకేశ్వరం: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం మండలంలోని పంచగుడి, గడ్‌చాంద, రాజూర గ్రామాల్లో నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి మహిళలు ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

నర్సాపూర్(జి): మండలంలోని బామ్ని (బి) గ్రామంలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల వద్ద మహిళలు, యువతులు ఆడిపాడారు.

కుంటాల: మండలంలోని విఠాపూర్‌లో సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో..

లోకేశ్వరం: దుబాయ్‌లో గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన తేలు వాణి-వెంకటేశ్ దంపతులు, ఇతరులు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. గల్ఫ్ తెలంగాణ ఫోరం అధ్యక్షుడు ఆకుల సురేందర్, జనరల్ సెక్రెటరీ వెంకటేశ్, గల్ఫ్ తెలంగాణ ఫోరం సభ్యులు, కళాకారులు బుర్ర సతీశ్‌గౌడ్, లాస్య ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందిస్తున్న కృష్ణంరాజు

ఖానాపూర్: మున్సిపల్ కార్మికుల సేవలు మరువలేనివని మాజీ మంత్రి ఐకేరెడ్డి (పీఏ), పట్టణానికి చెందిన ఓకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కృష్ణంరాజు పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 50 మంది కార్మికులకు సొంత డబ్బులతో దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు తన వంతుగా గొడుగులు అందిస్తానని ప్రకటించారు. మరో ఉపాధ్యాయుడు బాలాజీ సైతం కార్మికులకు టపాసులు అందిస్తానన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన పలువురిని సన్మానించారు. ఓకేఆర్ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సోయా పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధర రూ.4892 అందించాలని మండలంలోని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో దళారులు కేవలం రూ.4200కే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో తాము క్వింటాల్‌కు రూ.500 కు పైనే నష్టపోతున్నామని.. అధికారులు స్పందించి వరి కొనుగోలు కేంద్రం మాదిరి సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిర్మల్‌లో అరుదైన ఆపరేషన్



శిశువుతో వైద్యులు, తల్లిదండ్రులు

నిర్మల్: ఎక్కడో హైదరాబాద్ వంటి నగరంలో, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేసే అరుదైన ఆపరేషన్లు ఇప్పుడు నిర్మల్‌లోనే జరుగుతుండటం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటనిస్తోంది. తాజాగా నిర్మల్ వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను స్థానికంగానే చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన పూజిత-ప్రవీణ్ దంపతులకు మూడు నెలల కిందట బాబు జన్మించాడు. తల్లి కడుపులో ఉండగానే శిశువుకు కిడ్నీ, మూత్రనాలం మధ్యలో పీయూజే(పెల్వి యూరెటర్ జంక్షన్) వద్ద వాపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. బాబు జన్మించిన తర్వాత సమస్య తగ్గకపోగా.. మరింత పెరగగా తల్లిదండ్రులు పలు ఆస్పత్రులు తిరిగారు. చివరకు తెలిసిన వారి ద్వారా నిర్మల్‌లోని స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ చిన్నపిల్లల సర్జన్ లీలాకుమార్, జనరల్ సర్జన్ నాళం శశికాంత్, కిడ్నీ సంబంధిత సర్జన్ మల్లేశ్ తదితరులు కలిసి మూడు నెలల పసిగుడ్డుకు బుధవారం శస్త్రచికిత్స చేసి తన బాధను తప్పించారు. ఆపరేషన్ విజయవంతమై బాబు కోలుకోవడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహానగరాలకే పరిమితమైన కార్పొరేట్ వైద్యాన్ని నిర్మల్‌లో అందిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు నాళం శశికాంత్ సూచించారు.

ఎస్జీటీగా ఎంపికైన రైతుబిడ్డ



రెంజర్ల శిరీష

పెంబి: మండలంలోని మందపల్లికి చెందిన రెంజర్ల శిరీష డీఎస్సీలో సత్తా చాటి టీచర్ కొలువు దక్కించుకుంది. గ్రామానికి చెందిన రెంజర్ల చిన్న అశన్న-నర్సవ్వ దంపతులకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. అశన్న రెండేళ్ల కిందట మృతి చెందగా నర్సవ్వ కుటుంబాన్ని పోషిస్తోంది. టీటీసీ పూర్తి చేసిన వీరి మూడో కుమార్తె శిరీష గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మూడేళ్లు విద్యావలంటీర్‌గా పనిచేసింది. అనంతరం పెంబిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరగా.. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో మానేసి ఇంటి వద్దే పరీక్షకు సన్నద్ధమైంది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో డీఎస్సీ-2024లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించింది. శిరీష ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో ఆ నిరుపేద కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

ఎంపీవో పర్యటన

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామపంచాయతీలో గురువారం ఎంపీవో రత్నాకర్‌రావు పర్యటించారు. ఈసందర్భంగా పంచాయతీలో రికార్డులు తనిఖీ చేసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పలువురు పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.